క్లుప్తంగా

బాలల అక్రమ రవాణా నిర్మూలనకు కృషి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్టేషన్ మేనేజర్, జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: బాలల అక్రమ రవాణా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని విశాఖ రైల్వే స్టేషన్ మేనేజర్ టీఎస్ఎన్ రాజు పిలుపునిచ్చారు. అప్‌హోల్డ్ సంస్థ రూపొందించిన ప్రత్యేక పోస్టర్‌ను సోమవారం రైల్వే స్టేషన్‌లో గవర్నమెంట్ రైల్వే పోలీసులు (జీఆర్పీ), రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్) సిబ్బందితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యాక్సిస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్ ప్రాజెక్ట్ జిల్లా కోఆర్డినేటర్ జి. డేవిడ్ రాజ్ మాట్లాడుతూ, బాలల అక్రమ రవాణా నివారణకు అప్‌హోల్డ్ సంస్థ జిల్లాలో పనిచేస్తోందని తెలిపారు. జూలై 30న ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు కరపత్రాలు, ఫ్లెక్సీలు, పోస్టర్ల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో యాంటీ ట్రాఫికింగ్ యూనిట్ రాము, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ, జీఆర్పీ పి. భాస్కరరాజు, అప్‌హోల్డ్ సిబ్బంది పాల్గొన్నారు. బాలల అక్రమ రవాణా జరిగినప్పుడు 1098 లేదా 1800102722లకు తెలియజేయాలని వారు కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



51వ వార్డులో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మేయర్, ఎమ్మెల్యే, కార్పొరేటర్

మద్దిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధారలో పలు అభివృద్ధి పనులకు సోమవారం మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ శంకుస్థాపన చేశారు. కళింగనగర్‌లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, వుడా కాలనీలో ఆర్‌సీసీ కల్వర్టుకు సంబంధించి రూ.70 లక్షలతో నిర్మాణాలు చేపట్టడానికి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అందరం కలిసి వార్డులను అభివృద్ధి చేస్తామన్నారు. కార్పొరేటర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సహకారం ఎల్లప్పుడూ ఉండాలని, సమస్యలు చెప్పిన వెంటనే మేయర్, ఎమ్మెల్యే స్పందించి త్వరితగతిన నిర్మాణాలు చేపట్టడాన్ని అభినందిస్తున్నామన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న బుచ్చయ్య, క్లబ్ సభ్యులు

మురళీనగర్: మురళీనగర్‌లో నివసిస్తున్న చంద్రశేఖర్ అనే వ్యక్తి ఆరోగ్య పరిరక్షణకు వాకర్స్ క్లబ్ సభ్యులు ఆర్థిక సాయం అందించారు. చంద్రశేఖర్ రెండు కిడ్నీలు పాడవడంతో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. అతడి కుటుంబం పేదరికంలో ఉన్న విషయాన్ని డాక్టర్ డీడీ నాయుడు ద్వారా తెలుసుకుని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. ఈ మేరకు రూ.20,000 నగదును వాకర్స్ పార్కు వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.బుచ్చయ్య చేతుల మీదుగా సోమవారం చంద్రశేఖర్ కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి సిహెచ్.ప్రసాదరావు, సహాయ కార్యదర్శి ఎస్.ప్రకాశరావు, కోశాధికారి ఆర్.నాగేశ్వరరావు, డైరెక్టర్ వీరబాబు పాల్గొన్నారు.

మురళీనగర్ లైబ్రరీకి పుస్తకాల వితరణ



పుస్తకాలు అందిస్తున్న జంధ్యాల రవీంద్రనాథ్

మురళీనగర్: ధన సంపద కన్నా జ్ఞాన సంపద మిన్న అని గాయత్రి విద్యా పరిషత్ ఇంజినీరింగ్ కళాశాల విశ్రాంత ఆచార్యుడు జంధ్యాల రవీంద్రనాథ్ అన్నారు. మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖ గ్రంథాలయాన్ని సోమవారం ఆయన సందర్శించి పాఠకులతో మాట్లాడారు. ప్రతి రోజూ కనీసం గంట సేపు గ్రంథాలయానికి వచ్చి నచ్చిన పుస్తకాన్ని చదవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రంథాలయానికి ఆయన పుస్తకాలను వితరణగా అందించారు. లైబ్రేరియన్ వై.పద్మజ, పాఠకులు పాల్గొన్నారు.

వాహన మిత్ర ఎప్పుడు..?

నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సంక్షేమానికి పెద్దపీట వేసింది. వైఎస్సార్ వాహన మిత్ర పథకం కింద ఏటా రూ.10 వేల ఆర్థిక సాయం అందించింది. నవరత్నాల్లో భాగంగా అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పలు సంక్షేమ పథకాలతో డ్రైవర్ల కుటుంబాలకు లబ్ధి చేకూర్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆటో డ్రైవర్లకు ఈ సాయం అందలేదు. గత ఎన్నికల ప్రచారంలో బ్యాడ్జి కలిగిన ప్రతి డ్రైవర్‌కు ఏటా వాహన మిత్ర కింద రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారం చేపట్టి ఏడాది గడిచినా.. దీనిపై ఒక్క మాట కూడా మాట్లాడకుండా మోసం చేశారని ఆటో డ్రైవర్లు మండిపడుతున్నారు.

– సీతంపేట

- డ్రైవర్లకు ఏటా రూ.15 వేలు ఇస్తామని చంద్రబాబు మోసపూరిత హామీలు
- అధికారం చేపట్టి ఏడాది గడిచినా అమలు కాని పథకం
- వెంటనే ఆర్థిక సాయమందించాలంటూ రోడ్డెక్కిన ఆటోవాలాలు
- సంక్షేమ బోర్డు ఏర్పాటు, జీవో 21, 31ల రద్దుకు డిమాండ్
- 'ఉత్తర'లో సుమారు 6 వేల మంది డ్రైవర్ల ఎదురుచూపులు



వాహన మిత్ర అమలు చేయాలంటూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సీతమ్మధారలో ఆటోలతో నిరసన ర్యాలీ (ఫైల్)



సీతమ్మధారలో వాహన మిత్ర రూ.15 వేలు వెంటనే ఇవ్వాలని నిరసన తెలుపుతున్న ఆటో, టాక్సీ డ్రైవర్లు (ఫైల్)

డ్రైవర్లకు చంద్రబాబు ఇచ్చిన హామీలు

- బ్యాడ్జి కలిగిన అన్ని వాహనాల డ్రైవర్లకు వాహన మిత్ర పథకం కింద ప్రతి ఏటా రూ.15 వేలు ఆర్థిక సాయం.
- భారీగా జరిమానాలకు కారణమవుతున్న జీవో నంబర్ 21, 31ల రద్దు.
- డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు.
- డీజిల్, పెట్రోల్ ధరల తగ్గింపు.
- టాటా మ్యాజిక్ వ్యాన్‌లు, జీపులు, కార్లకు గ్రీన్ టాక్స్, లేబర్ టాక్స్, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, టోల్‌గేట్ ఫీజుల తగ్గింపు.
- డ్రైవర్ల సాధికార సంస్థ ఏర్పాటు చేసి ప్రమాద బీమా, హెల్త్ ఇన్సూరెన్స్, విద్యా రుణాలు.
- చంద్రన్న బీమా ద్వారా సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాద మరణానికి రూ.10 లక్షల చెల్లింపు.

ఉత్తర నియోజకవర్గంలో సుమారు 6 వేల మంది డ్రైవర్లు నివసిస్తున్నారు. ఉద్యోగాలు లేక స్వయం ఉపాధి కింద ఆటోలు, వ్యాన్‌లు, కార్లు, జీపులు ప్రైవేట్ ఫైనాన్సర్ల నుంచి అప్పులు తీసుకుని ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ప్రభుత్వానికి కోట్లాది రూపాయల పన్నులు చెల్లిస్తున్న డ్రైవర్ల సంక్షేమాన్ని విస్మరించిన చంద్రబాబు ప్రభుత్వంపై ఆటో డ్రైవర్లు మండిపడుతున్నారు. ఒకవైపు భారీగా పెరిగిన నిత్యావసర సరకుల ధరలు, మరోవైపు పెట్రోల్, డీజిల్ ధరల బాదుడు, వీటికి తోడు ప్రభుత్వం అమలు చేస్తున్న 21, 31 నంబర్ జీవోలతో భారీ జరిమానాలు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించడంతో ఆటో డ్రైవర్లు, మోటార్ వర్కర్లు తమకు వస్తున్న అంతంత మాత్రం ఆదాయంలో చాలా వరకు నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చిన వాహన మిత్ర అమలు, డ్రైవర్ల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలంటూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల ఆటో డ్రైవర్లు రోడ్డెక్కి సీతమ్మధార నుంచి ఇసుకతోట కూడలి వరకు ఆటోలతో నిరసన ర్యాలీ చేపట్టారు. వీరంతా ప్రభుత్వ ఆర్థిక సాయం కోసం ఏడాదిగా ఎదురు చూస్తున్నారు.

లక్షల మంది ఎదురుచూపులు



బ్యాడ్జి కలిగిన ప్రతి డ్రైవర్‌కు ఏటా రూ.15 వేలు చొప్పున వాహన మిత్ర కింద ఇస్తామని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో సుమారు 92 లక్షల మంది బ్యాడ్జి ఉన్న డ్రైవర్లున్నారు. వారంతా ఏడాదిగా వాహన మిత్ర కోసం ఎదురు చూస్తున్నారు. 21, 31 జీవోల రద్దు, పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు, ప్రమాద బీమా అమలు చేస్తానని హామీ ఇచ్చారు. ఏ ఒక్కటీ అమలు కాలేదు. పెరిగిన సరకులు, ఇంధన ధరలు, జరిమానాలు, ఫిట్‌నెస్ మంజూరు ప్రైవేటుకు అప్పగించడం, ఫీజులు పెంచుకునే అవకాశం కల్పించడం వల్ల ఆటో డ్రైవర్లు, మోటారు వర్కర్లు చాలా నష్టపోతున్నారు.

– పడాల రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏఐటీయూసీ

వాహన మిత్ర ఊసెత్తడం లేదు



గత ప్రభుత్వం వాహన మిత్ర కింద రూ.10 వేలు ఇచ్చింది. చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో డ్రైవర్లకు ఏటా రూ.15 వేలు ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా.. ఆ ఊసెత్తడం లేదు. అందుకే ఆందోళనకు సిద్ధమయ్యాం. నగరంలోని ప్రతి నియోజకవర్గంలో 5 వేల నుంచి 8 వేల మంది డ్రైవర్లు ఉన్నారు. వారంతా ఎప్పుడు వాహన మిత్ర డబ్బులు వేస్తారా, తమ వాహనాలు మరమ్మతులు, ఎఫ్‌సీ కోసం ఖర్చు చేద్దామా అని ఎదురు చూస్తున్నారు.

– పడాల గోవింద్, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ మోటార్ వర్కర్స్ ఫెడరేషన్

ఏడాది దాటినా చర్యలు శూన్యం



కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చి ఏడాది కాలం దాటిపోయినా ఏవిధమైన చర్యలు చేపట్టక పోవడం దారుణం. ఇప్పటికే సరకులు, కూరగాయలు, పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్నంటాయి. పిల్లల ఫీజులు, ఇంటి అద్దెలు, చాలీచాలని ఆదాయంతో కుటుంబాన్ని భారంగా నెట్టుకొస్తున్నాం. ప్రభుత్వం వాహన మిత్ర ప్రతి ఏటా ఇస్తే మా వాహనాల మెయింటనెన్స్‌కు ఉపయోగపడుతుంది.

– ఎన్.మధురెడ్డి, ఆటో డ్రైవర్, అక్కయ్యపాలెం

ఎన్నికల హామీ నెరవేర్చాలి



ర్యాపిడో బైక్స్ వచ్చాక ఆటో డ్రైవర్ల ఉపాధికి, ఆదాయానికి గండి పడింది. నగరంలో 6 వేల వరకు ర్యాపిడో బైక్స్ తిరుగుతున్నాయి. స్వయం ఉపాధితో బతుకుతున్న తమకు ర్యాపిడో బైక్స్, కొత్త చట్టాలు, భారీ జరిమానాలు, ఇంధన ధరలు రోడ్డున పడేస్తున్నాయి. పోలీస్, ఆర్టీవో డిపార్ట్‌మెంట్లు అడ్డూఅదుపు లేకుండా తనిఖీలు చేసి వాహనాలు సీజ్ చేయడం, భారీ జరిమానాలు విధిస్తూ సమస్యలకు గురిచేస్తున్నారు. ప్రభుత్వం తమ సంక్షేమంపై దృష్టి సారించి ఎన్నికల హామీలు నెరవేర్చాలి.

– ఎం.రాంబాబు, మ్యాక్స్ క్యాబ్ డ్రైవర్, సీతమ్మధార

రైల్వేస్టేషన్ పరిసరాల పరిశుభ్రతకు చర్యలు

జీవీఎంసీ కమిషనర్ ఆదేశం



రైల్వేస్టేషన్ అధికారులకు సూచనలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

తాటిచెట్లపాలెం: రైల్వే స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని రైల్వే, ప్రజారోగ్య అధికారులకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం జోన్–5 పరిధి రైల్వే స్టేషన్ నుంచి తాటిచెట్లపాలెంలో ఆయన పర్యటించారు. రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ఎదురుగా పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులను రోజూ ఎన్ని గంటలకు విధులకు వస్తున్నారని, వ్యర్థాలను క్లాప్ వాహనం ద్వారా ఎన్నిసార్లు తరలిస్తారని అడిగి తెలుసుకున్నారు. రైల్వే స్టేషన్ జనరల్ బుకింగ్ కౌంటర్ పరిసర ప్రాంతాలైన కార్ పార్కింగ్, వీఐపీ కార్ పార్కింగ్, ఆటో స్టాండ్ పార్కింగ్ వద్ద ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ, రైల్వే స్టేషన్ పర్యవేక్షకుడు జి.సి.నాయక్‌లతో కలిసి కమిషనర్ పరిశీలించారు. రైల్వే స్టేషన్ ప్రాంగణంలోని దుకాణాల వద్ద, పరిసర ప్రాంతాల్లో అధికంగా వ్యర్థాలు ఉండటం గమనించి రైల్వే హెల్త్ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని, రైల్వే యాజమాన్యానికి నోటీసులు జారీ చేయాలని జోనల్ కమిషనర్ రాముకు ఆదేశించారు. రైల్వే స్టేషన్ మార్గంలో, అక్కడి దుకాణాల వద్ద డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసి, ప్రయాణికులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించేలా నిత్యం పబ్లిక్ అడ్రస్ సిస్టం ద్వారా ప్రకటన చేయాలని రైల్వే అధికారులకు సూచించారు. రైల్వే స్టేషన్ బయట లోటస్ ఇంటర్నేషనల్ నిర్వహిస్తున్న ప్రజా మరుగుదొడ్లను పరిశీలించారు. స్టేషన్ రోడ్డులో ప్రణాళికాబద్ధంగా చిరు వ్యాపారాలు చేసుకునేలా చూడాలన్నారు. పర్యటనలో జెడ్సీ రాము, ఈఈ దిలీప్, ఏఈ పళనికుమార్, హార్టికల్చర్ ఆఫీసర్ అర్చన, శానిటరీ సూపర్‌వైజర్ జనార్దన్, వార్డు సచివాలయం కార్యదర్శులు పాల్గొన్నారు.

అట్రాసిటీ చట్టం అమలులో యంత్రాంగం విఫలం



ఆడిట్ రిపోర్ట్ ఆవిష్కరిస్తున్న ఆచార్య చలం తదితరులు

సీతంపేట: దళితులు చైతన్యవంతులై నిలదీస్తే చట్టాలు పక్కాగా అమలవుతాయని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ చైర్మన్ ఆచార్య కె.ఎస్. చలం అన్నారు. సిటిజన్స్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'ఎస్సీ, ఎస్టీ ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ యాక్ట్ 1989, రూల్స్ 1995' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. దళిత ఆదివాసీలపై దాడులు పెరుగుతూనే ఉన్నాయని, దేశవ్యాప్తంగా దళితులపై అంతులేని వివక్ష కొనసాగుతోందన్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలు తీరు దారుణంగా ఉందని ఎన్‌సీడీహెచ్‌ఆర్ చాప్టర్ రాష్ట్ర కన్వీనర్ చిట్టిబాబు రూపొందించిన నివేదిక ద్వారా తేటతెల్లమైందన్నారు. ఇప్పటికీ వేల సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయంటే ఈ చట్టం అమలు తీరు అర్థమవుతోందన్నారు. చట్టం అమలు తీరుపై రూపొందించిన ఆడిట్ రిపోర్ట్‌ను ఆవిష్కరించారు. కన్వీనర్ చిట్టిబాబు మాట్లాడుతూ రోజుకు ఆరు అత్యాచారాలు, నెలకు ఐదు హత్యలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని నియంత్రించడంలో, అట్రాసిటీ చట్టం అమలులో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విఫలమైందన్నారు. సుప్రీం కోర్టు సైతం చట్టం అమలుపై ఆడిట్ చేయాలని తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. చట్టం పటిష్టంగా అమలయ్యేలా ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ రిటైర్డ్ జేడీ టి.విజయ్‌కుమార్, పారా డైరెక్టర్ థామస్, డీబీఎఫ్ జాతీయ అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్, వివిధ సంస్థల ప్రతినిధులు దేవకుమార్, మంజు, ఉదయ్‌కుమార్, మాల్యాద్రి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

'శ్రీపద సంకీర్తన' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ ద్వారం త్యాగరాజు తదితరులు

సీతంపేట: రాజయోగి వెంకటపతి స్వామి రచించిన 'శ్రీపద సంకీర్తన' పుస్తకావిష్కరణ కార్యక్రమం సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. సహృదయ సాహితి, శ్రీజగత్కల్యాణ పీఠం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంగీత విద్వాంసుడు డాక్టర్ ద్వారం వి.కె.జి.త్యాగరాజు చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావ్యాలు మూడు రకాలని, నారికేళ పాకం, కదళీ పాకం, ద్రాక్ష పాకంలతో పోల్చారు. పుస్తక రచయిత వెంకటపతి స్వామిని కొనియాడారు. ద్వారం మ్యూజిక్ అకాడమీ త్యాగరాజ శిష్య బృందంచే కనకమహాలక్ష్మి సంకీర్తన గానలహరి అలరించింది. కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త మరడాన నాగేశ్వరరావు, డాక్టర్ డి.వి.సూర్యారావు, శేఖరమంత్రి ప్రభాకర్ పాల్గొన్నారు.

త్వరితగతిన అర్జీల పరిష్కారం

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో అర్జీదారుల నుంచి నాలుగు వినతులను జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము స్వీకరించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ విభాగానికి 02, పబ్లిక్ హెల్త్ విభాగానికి 01, వాటర్ సప్లై విభాగానికి 01 చొప్పున అర్జీలు అందినట్లు తెలిపారు. ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను జెడ్సీ ఆదేశించారు. రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పేరిట నమ్మించి మోసం



బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, నాయకులు



కార్యక్రమానికి హాజరైన మహిళలు

- కూటమి పాలనపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు మండిపాటు
- 25వ వార్డులో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'

సీతంపేట: ఎన్నికల సమయంలో ఓట్లు, సీట్ల కోసం అమలు కాని హామీలిచ్చి చంద్రబాబు ప్రభుత్వం ప్రజలను నిలువునా మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు దుయ్యబట్టారు. 25వ వార్డు రెల్లి వీధిలో సోమవారం నిర్వహించిన 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. 2019 నుంచి 2024 వరకు నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి, విద్యా కానుక, వసతి దీవెన, వాహన మిత్ర, చేదోడు, ఆరోగ్యశ్రీ, కాపు నేస్తం.. ఇలా 30 వరకు సంక్షేమ పథకాలు అమలు చేసి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా రూ.2.70 లక్షల కోట్ల ఆర్థిక సాయం జమచేశారని గుర్తుచేశారు. సూపర్‌సిక్స్‌తోపాటు అంతకంటే నాలుగు రెట్లు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని గత ఎన్నికల సమయంలో కూటమి నేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ హామీలిచ్చి ప్రజలను నమ్మించారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఒక్క పథకాన్ని అమలు చేయకుండా ప్రజానీకాన్ని మోసం చేయడం దారుణమన్నారు. నిరుద్యోగ భృతి కింద రూ.3 వేల చొప్పున ప్రతి నిరుద్యోగికి కూటమి ప్రభుత్వం రూ.42 వేలు బాకీ పడిందన్నారు. ప్రతి మహిళకు నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు ఇస్తామని చెప్పి మోసం చేశారని, ప్రతి ఆడబిడ్డకు రూ.21 వేలు చెల్లించాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం హామీ అమలైందా అని ప్రశ్నించారు. 2024కి తల్లికి వందనం ఇవ్వలేదని, వైఎస్సార్‌సీపీ శ్రేణులు ధర్నాలు చేస్తే ఈ ఏడాది అరకొరగా ఇచ్చి చేతులు దులిపేశారని విమర్శించారు.

కూటమి నాయకులను నిలదీయండి

నేడు ఆరోగ్యశ్రీలో వైద్యం చేయించుకునే పరిస్థితి లేకపోవడంతో ఎందరో పేదలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని కె.కె.రాజు అన్నారు. తలసేమియా, డయాలసిస్ పేషెంట్లకు వైఎస్ జగన్ నెలకు రూ.10 వేలు పింఛన్ ఇచ్చేవారని, కూటమి ప్రభుత్వం దానిని తొలగించిందని చెప్పారు. విద్యా శాఖా మంత్రి లోకేశ్ విద్యార్థులకు ఇచ్చిన స్కూల్ బ్యాగులు పది రోజులకే చిరిగిపోయాయని విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో పథకాలన్నీ అమలు చేస్తామని కూటమి నాయకులు సంతకాలు చేసి బాండ్లు ఇచ్చారని, వాటిని ఎందుకు అమలు చేయలేదని మీ ప్రాంత కూటమి నాయకులను స్థానికులు ప్రశ్నించి నిలదీయాలన్నారు. అర్హత ఉండి పథకాలు రానివారు తమ దృష్టికి తీసుకొస్తే ప్రజల తరఫున వైఎస్సార్‌సీపీ పోరాడుతుందని కె.కె.రాజు తెలిపారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కరపత్రాలను ఆవిష్కరించి ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బోగవిల్లి గోవింద్, అంబటి శైలేష్, సానబోయిన సురేష్, సింహాచలం దేవస్థానం పూర్వ పాలక మండలి సభ్యులు సంపంగి శ్రీనివాసరావు, పోతుబంతి హరికృష్ణ, నూకరాజు, ఎస్.సత్యనారాయణ, కొమ్ము నాగు, మందూరి అప్పలరాజు, బొమ్మాళి రవి, సూరిబాబు, కృపారావు, సురేష్, ఆసనాల రాజు, పెద్ద సంఖ్యలో స్థానిక మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మాణం ఆపాలని వినతి



జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎన్‌జీజీవోస్ కాలనీ ప్రతినిధులు

మురళీనగర్: ఎన్‌జీజీవోస్ కాలనీ మెయిన్ రోడ్ కూడలి నివాస ప్రాంతంలో సెల్ టవర్ నిర్మాణాన్ని ఆపాలని ఎన్‌జీజీవోస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు వీరు సోమవారం జీవీఎంసీ కమిషనర్, మేయర్‌లను పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలిసి వినతిపత్రం అందించారు. ఇక్కడ సెల్ టవర్ నిర్మిస్తే నివాసులతో పాటు, వివిధ పాఠశాలల విద్యార్థులు, సమీపంలోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని వివరించారు. వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి కె.రామచంద్ర రాజు, ఉపాధ్యక్షుడు పి.బలరాం స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

సీతంపేట: పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల ఆధార్ వివరాలు అప్‌డేట్ చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారామ్ ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని యాజమాన్యాల సారథ్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలు, కళాశాలల్లో 15 ఏళ్లు దాటే విద్యార్థుల ఆధార్ అప్‌డేట్ కేంద్రాలు ఏర్పాటు విధానానికి కొత్త టెక్నాలజీతో చర్యలు చేపట్టి బాలల హక్కులను పరిరక్షించాలన్నారు. ఈమేరకు ముఖ్యమంత్రికి, విద్యా శాఖా మంత్రికి, యూఐడీఏఐ సంస్థ సీఈవోకు లేఖలు రాసినట్టు తెలిపారు. ఏడేళ్లు దాటిన పిల్లలకు ఆధార్ అప్‌డేట్‌ను కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేసిందన్నారు. రాష్ట్రంలో 5 నుంచి 7 ఏళ్ల మధ్య ఉన్న పిల్లల సంఖ్య అధికంగా ఉందని, ఆధార్ సెంటర్లు అందుబాటులో లేక తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. దీంతో ఆధార్ కార్డు అప్‌డేట్ కాక ఎంతో మంది పిల్లలు స్కాలర్‌షిప్‌లు, సంక్షేమ పథకాలకు అర్హత కోల్పోతున్నారన్నారు. ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి ఆధార్ కేంద్రాలు అందుబాటులోకి తేవాలని కోరారు.

రైల్వేస్టేషన్‌లో 24 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన తనిఖీల్లో మూడు వేర్వేరు కేసుల్లో 24 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ కె.టి.ఆర్.లక్ష్మి, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ పి.శివనారాయణలు తమ సిబ్బందితో కలిసి స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు చేశారు. ఒడిశా గంజాం జిల్లాకు చెందిన రాహుల్ కుమార్ విశాఖ రైల్వే స్టేషన్ మీదుగా ఢిల్లీకి గంజాయిని అక్రమంగా తీసుకురావడం గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఇతడి వద్ద నుంచి రూ.50 వేల విలువైన 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

- జీఆర్పీ ఎస్ఐ ఎస్.రామారావు, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ ఎస్.చిట్టిబాబు తమ సిబ్బందితో కలిసి వివిధ ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు నిర్వహించారు. ఉత్తరప్రదేశ్ ఆలీగఢ్ జిల్లాకు చెందిన మోహన్ చౌదరి, కిషన్ కుమార్‌లు అరకు బొర్రాగుహల నుంచి విశాఖ రైల్వే స్టేషన్ మీదుగా ఉత్తరప్రదేశ్‌కు గంజాయిని అక్రమంగా తీసుకెళ్లడాన్ని గుర్తించి వీరిని అదుపులోకి తీసుకున్నారు. రూ.50 వేల విలువైన 10 కేజీల గంజాయిని సీజ్ చేశారు.
- జీఆర్పీ ఎస్ఐ కె.టి.ఆర్.లక్ష్మి, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ చిట్టిబాబు తమ సిబ్బందితో కలిసి వివిధ ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు చేశారు. ఒడిశా కోరాపుట్ జిల్లాకు చెందిన దశరథ్ మాతం విశాఖ రైల్వే మీదుగా గంజాయిని అక్రమంగా తీసుకురావడం గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఇతడి వద్ద నుంచి రూ.20 వేల విలువైన 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచారు.